


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:36    ఎడిటర్: రాపోలు లింగస్వామి    06 -10-2026 మంగళవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam,    పేజీలు:4    వెల: 2-00

### సీఈసీ రాజీనామా చేయాలి..

## బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు

**: ఖర్గే, నారాయణ**



దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ , ఎన్నికల కమిషన్ వ్యవహార శైలిపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీ తరఫున 3 కీలక డిమాండ్లను లేవనెత్తగా, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ పార్టీ 3 కీలక డిమాండ్లు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ తరఫున మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను తక్షణమే రద్దు చేయాలని, రాబోయే అన్ని ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా కేవలం బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలన్న ఈ మూడు డిమాండ్లను ఖర్గే ప్రస్తావించారు. 'ఈ మూడు డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు రోడ్లపైకి వచ్చి పోరాడుతున్నాయి. ఈ ఉద్యమంలో పాల్గొంటున్న పౌర సమాజ సభ్యులకు, యువజన సంఘాలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది. ఢిల్లీ ఆందోళనల సందర్భంగా మహిళా విలేకరులపై జరిగిన వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశంలో నిరంకుశ పాలకులు తీవ్ర భయాందోళనలో ఉన్నారు.' అంటూ మల్లికార్జున ఖర్గే తన సందేశంలో పేర్కొన్నారు.

## ఓట్ల చోరీతో పాటు జేబు చోరీకి తెగబడ్డారు

**: సీపీఐ నేత నారాయణ**



మరోవైపు ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన సీపీఐ సీనియర్ నాయ కుడు నారాయణ, కేంద్ర ప్రభుత్వం, సీఈసీపై తీవ్ర ఆరోపణలు చేశారు. కేరళలో ప్రారంభమైన ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాం శంగా మారిందని, ఎలక్షన్ సిస్టమ్‌లో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం తీవ్రమవుతోందన్నారు. వాడవాడలా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని నారాయణ తెలిపారు. ఒకవైపు ఓట్ల చోరీకి పాల్పడుతూనే, మరోవైపు యూపీఐ ని ప్రవేశపెట్టి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ బీజేపీ ప్రభుత్వం జేబు చోరీకి తెగబడిందని కూడా నారాయణ మండిపడ్డారు. గతంలో విద్యామంత్రి రాజీనామాతో ప్రధాని మోదీ గండం నుంచి బయటపడ్డారని, అయితే ఇప్పుడు ఈ సీఈసీ వ్యవహారం నేరుగా ప్రధాని మోదీ మెడకే చుట్టుకునే పరిస్థితి కనిపిస్తోందని నారాయణ వ్యాఖ్యానించారు.

## వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు

**: కేటీఆర్**



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలి

**: రామచందర్ రావు**



హైదరాబాద్‌లో లక్షలాది మంది రోహింగ్యాలు ఉన్నారని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు కల్పించాలని అన్నారు. బిజెపి కార్యాలయంలో జరిగిన పదాధికారుల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని నమ్మే పార్టీ బిజెపి అని రామచందర్ రావు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను బిజెపి కొత్తగా ప్రారంభించలేదని, గతంలో కూడా ఈ ప్రక్రియ అమలులో ఉందని, యూపిఎ ప్రభుత్వ హయాంలోనూ ఎస్ఐఆర్ నిర్వహించారని తెలియజేశారు. దేశ విచ్చిన్న శక్తులు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని సూచించారు. అక్రమంగా గెలుస్తున్నారని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అంటున్నారని, అక్రమమైతే తెలంగాణ,కేరళం, హిమాచల్ సిఎంలు రాజీనామా చేయాలని హితవు పలికారు. తమరు గెలిస్తే ఇవిఎంలు మంచివి..ఓడిపోతే మంచివి కావా? అని ప్రశ్నించారు. గతంలో మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం.. ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి బ్రదర్స్ బాగుపడుతున్నారని చురకలంటించారు. తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడలేదని, తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తెచ్చుకుందామని రామచందర్ రావు పిలుపునిచ్చారు.

## బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలు

**మోదీ, అమిత్ షా వద్దకు వెళ్లి బీసీల హక్కుల కోసం అడిగే దమ్ము వారికి లేదు**

**బీసీల వాటా కోసం అవసరమైతే లాక్కుంటాం**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని రీతిలో సభ విజయవంతం**

**ఓబిసి చైర్మన్ వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక అభినందనలు**



బీసీల హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీసీల హక్కుల కోసం మాట్లాడే ధైర్యాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తమకు ఇచ్చారని తెలిపారు. శంషాబాద్ మండలం గొల్లపల్లిలో టీపీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో, షాద్‌నగర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఓబీసీ సింహగర్జన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు రావాల్సిన వాటా సాధించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే తమ వాటాను లాక్కుంటామని అన్నారు. బీసీల హక్కుల కోసం మాట్లాడే ధైర్యం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేదని విమర్శించారు. మోదీ, అమిత్ షా వద్దకు వెళ్లి బీసీల హక్కుల గురించి ప్రశ్నించే దమ్ము వారికి లేదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో 'ఎవరి సంఖ్య ఎంతైతే వారికి అంత వాటా' అనే నినాదం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చిందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో నిర్వహించిన కుల సర్వే సాకారం అయి ఉంటే యావత్ దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచేదన్నారు. కేంద్రం చేపట్టే జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఉండాలని డిమాండ్ చేశారు. కుల సర్వే నిర్వహించి దానికి సంబంధించిన పత్రాన్ని సిద్ధం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రుల సహకారం ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 55 శాతానికి పైగా సర్పంచ్ పదవులను బీసీలకు కల్పించామని, మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం సీట్లు బీసీలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. మంత్రివర్గంలో, ఎమ్మెల్సీలలో, వివిధ కార్పొరేషన్లలో బీసీల ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుతామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కులాలను పక్కనపెట్టి బీసీలంతా ఏకం కావాలని, భవిష్యత్ తరాల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమది న్యాయమైన కోరిక అని, బీసీలకు రావాల్సిన వాటా దక్కే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల సర్వే నిర్వహిస్తామని ఆయన అన్నారు. మోదీ గద్దె దిగే సమయం వచ్చిందని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కాగా, వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ సింహగర్జన సభకు భారీగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సభకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు తదితరులు హాజరయ్యారు. సభ విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించిన వీర్లపల్లి శంకర్‌ను మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు..

## హయత్‌నగర్ లేబర్ అడ్డా సమస్యకు పరిష్కారం

### కార్మికులకు ప్రత్యామ్నాయ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు



హయత్‌నగర్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 05:హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద నెలకొన్న సమస్యలపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక కాలనీవాసులు, కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లేబర్ అడ్డా కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. లేబర్ అడ్డా వద్ద రోడ్లపైనే మూత్ర విసర్జన చేయడం, పేకాట ఆడటం, రోడ్డు పక్కనే నిద్రించడం వంటి కారణాలతో మహిళలు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లేబర్ అడ్డాను మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందిస్తూ.. ఏళ్లుగా ఇక్కడ జీవనోపాధి పొందుతున్న కార్మికులకు ఇబ్బంది కలగ కుండా సమస్యను పరిష్కరి స్తామని తెలిపారు. రేడియో స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్ ప్రాంతంలో కార్మికుల కోసం మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, విశ్రాంతి కోసం షెడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందుకు కార్మికులు కూడా అంగీకారం తెలిపారు. అదేవిధంగా స్థానిక ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి లేబర్ అడ్డా వద్ద కార్మికులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. లేబర్ అడ్డాను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించడంతో పాటు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్, గుత్త లక్ష్మారెడ్డి, దీపావళి శ్రీకాంత్‌తో పాటు పలువురు కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## సాధారణంలో అసాధారణం.. కళాత్మకతలో కొత్త కోణం

అద్భుతమైన ప్రకృతి దృశ్యాన్ని చూసి పొందే పరవశమా? ఏదైనా అసాధారణ కళారూపం మనపై చూపే బలమైన ప్రభావమా? లేక ఒక గొప్ప చిత్రాన్ని చూసినప్పుడు కలిగే అనుభూతినా? సౌందర్యశాస్త్ర చర్చల్లో చాలాకాలంపాటు ఈ ప్రశ్నలు కళల చుట్టూ, ప్రకృతి వైభవం చుట్టూ, అరుదైన అనుభవాల చుట్టూనే తిరిగాయి. కానీ మనిషి జీవితం ఎప్పుడూ ఇలాంటి గొప్ప క్షణాల తోనే గడవదు. నిత్యం ఎదురయ్యే సాధారణ వస్తువులు, అలవాటైన పనులు, పరిచయమైన పరిసరాలు, చిన్నచిన్న ఎంపికలతోనే మన బతుకు సాగుతుంది. మరి ఈ సాదాసీదా జీవితంలో సౌందర్యం ఉండదా? ఉంటే అది ఎక్కడ, ఏ రూపంలో కనిపిస్తుంది? థామస్ లెడ్డి రాసినపుస్తకం లేవనెత్తే ముఖ్యమైన ప్రశ్న ఇదే. ఈ నేపథ్యంలో 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనే మాటను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇది థామస్ లెడ్డి తన సిద్ధాంతానికి పెట్టిన పేరు కాదు. ఆయన సూక్ష్మ సౌందర్యానుభవం , అతిసూక్ష్మ సౌందర్యానుభవం సూక్ష్మ సౌందర్య ప్రభావం వంటి మాటలతో చిన్నచిన్న సౌందర్య సందర్భాలను వివరిస్తారు. అలాగే సౌందర్య పూర్వదశ , సౌందర్యానుభవ ఆరంభ రూపం వంటి స్థితులనూ చర్చిస్తారు. అందువల్ల 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనేది నిత్యజీవిత సౌందర్యంపై ఆయన ఆలోచనలన్నింటినీ కలిపి అర్థం చేసుకోవడానికి వాడే ఒక సులువైన మాట మాత్రమే.

ఇక్కడ 'సూక్ష్మ' అంటే సౌందర్యం విలువ తక్కువని కాదు, అనుభవపు తీవ్రత తక్కువని, పరిధి చిన్నదని, సందర్భం చాలా సాధారణమైనదని అర్థం. రోజూ వేసుకునే బట్టలు ఎంచుకునేటప్పుడు వాటి రంగు, తీరు, పొందిక మనకు నచ్చవచ్చు. అక్కడ పెద్ద పారవశ్యం ఏమీ కలుగకపోవచ్చు, అయినా ఆ బట్టల తీరు మన కండ్లను ఆకట్టుకుంటుంది. వస్తువు ఉపయోగం కంటే దాని రూపురేఖలే మనకు నచ్చిన ఆ క్షణంలోనే ఒక చిన్న సౌందర్యానుభవం మొదలవుతుంది.

ఈ అనుభవానికి శ్రద్ధ అవసరం. మన చుట్టూ ఎన్నో వస్తువులు ఉంటాయి. రోజూ చూసే అలవాటు వల్ల, వాటి పనేంటో మనకు తెలుసునన్న ధీమాతో వాటి రూపాన్ని ప్రత్యేకంగా గమనించం. కానీ కాస్త మనసు పెట్టి చూస్తే పరిస్థితి మారిపోతుంది. వాటి రంగు,తీరు,అమరిక, పరిసరాల ప్రత్యేకత స్పష్టంగా కండ్ల ముందు నిలుస్తాయి. ఇక్కడ వస్తువులో ఏ మార్పూ ఉండదు, మారేది మనచూపు మాత్రమే.ఆమారినచూపులోనే సౌందర్యం దాగివున్నది.

ఇలాంటి నిత్యజీవిత తాత్విక చూపు దాసరి అమరేంద్ర యాత్రా రచనలైన 'అండమాన్ డైరీ' (2016), 'గల్ఫ్ గీతం' (2021)లలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉరుకుల పరుగుల జీవితంలో సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని ఆస్వాదించే తీరిక కరువవుతున్నదని 'అండమాన్ డైరీ'లో రచయిత బాధపడతారు. వెన్నెల కాంతిని చూసి ఆనందించే తీరికా ఉండదు. కండ్ల ముందు ఎన్నో అందమైన దృశ్యాలు కదలిపోతున్నా, ఆగి చూసే శ్రద్ధ, స్పందించే మనసు లోపిస్తున్నాయి. ఈ ఆవేదనలో ప్రకృతిపై ప్రేమే కాకుండా, ఆధునిక మనిషిలో సన్నగిల్లుతున్న పరిశీలనా దృష్టి గురించిన ఆలోచన కూడా కనిపిస్తుంది.

రచయిత ఆ శ్రద్ధను తన రచనలో నిలబెట్టుకుంటూ, పెద్ద దృశ్యాలకే కాకుండా చిన్న విషయాలకూ విలువనిస్తారు. రచనలో ఒక పోలీసు.. యువతి తనను స్థానిక ద్వీపవాసిగా పొరబడిన చిన్న సంగతిని ఆయన ఎంతో సరదాగా గుర్తుచేసుకుంటారు. 'అంతకన్నా గొప్ప యోగ్యతా పత్రం చలం గారు కూడా ఇవ్వలేరు!' అనే మాటతో ఆ చిన్న సన్నివేశానికి కొత్త అందం వస్తుంది. ఇక్కడ సౌందర్యం ప్రకృతిలో కాదు, అది మనుషుల మాటల్లో, ఆత్మీయ జ్ఞాపకాల్లో, సున్నిత హాస్యంలో మెరుస్తుంది.

బ్రిటిష్ వృద్ధురాలిని కలిసిన సందర్భంలో ఈ చూపు మరింత విచ్చుకుంటుంది. ఆమె రూపం, మాటలు, రచయిత జవాబు, ఆ తర్వాత సంధ్యావేళ ఆకాశంలో విరిసిన రంగుల సొగసు కలిసి ఒక అందమైన దృశ్యంగా మారతాయి. సూర్యాస్తమయం తర్వాత మిగిలిన రంగులను రచయిత ఒక పాత జ్ఞాపకంతో ముడివేస్తారు. దృశ్యం అక్కడితో ఆగక జ్ఞాపకమై, ఊహతో కలిసి, ఒక సాధారణ క్షణాన్ని గొప్ప అనుభూతిగా మలుస్తుంది.

ఓడ ప్రయాణాన్ని వర్ణించేటప్పుడు కూడా ఇలాంటి చిన్న సౌందర్యమే కనిపిస్తుంది. బయలుదేరాల్సిన సమయం దగ్గరపడినా ఓడ ఇంకా 'నిద్రలేచే లక్షణాలే' చూపలేదని రచయిత రాస్తారు.ఓడ కదలకుండాఉండటంసాధారణ విషయమే అయినా, దాన్ని ఇంకా మేల్కొనని మనిషిలా ఊహించడంతో ఆ మాటలకు ప్రాణం వస్తుంది. మామూలు సమాచారం ఒక చక్కని రూపకంగా మారి పాఠకుడి మనసులో నిలుస్తుంది. నిత్య జీవిత వాస్తవం సాహిత్యంలో కొత్త సొగసును సంతరించుకుంటుంది. ఇదే దృష్టి 'గల్ఫ్ గీతం'లో మరో తీరుగా దర్శనమిస్తుంది. పుస్తక పరిచయంలోనే ప్రయాణాన్ని కేవలం ఊళ్లు చూడటంగా కాకుండా, కొత్త అనుభవాలను పొందే సాధనంగా భావించాలనే ఆలోచన కనిపిస్తుంది. 'ప్రతి ప్రయాణమూ ఒక పాఠం, ప్రతి మనిషీ ఒక నడిచే పుస్తకం, ప్రతి అనుభవమూ ఆ పుస్తకంలో ఒక అధ్యాయం' అనే మాటలు యాత్రకు మంచి లోతును ఇస్తాయి.

ఈ పుస్తకంలో ఆయన నగరాల పైపై మెరుగులనే కాకుండా, దారిపొడవునా కనిపించే చిన్న చిన్న విషయాలను కూడా ఎంతో ఆసక్తితో చూస్తారు. ఎడారి ఒడిలోని నీటి చెలమలు, పచ్చదనం, చెట్ల నీడన సాగే నడక దారులు, అక్కడి ఆహ్లాదం, ఆ నిర్మాణాల చక్కదనం ఆయన రాతల్లో ప్రాణం పోసుకుంటాయి. ఇక్కడ ప్రయాణ వివరాల కంటే, ఆ దృశ్యం రచయిత మనసులో కలిగించిన స్పందనే మనకు నచ్చుతుంది. మనుషులను పరిచయం చేయడంలోనూ ఇదే శ్రద్ధ కనిపిస్తుంది.

# సిబ్బందికి దసరా కానుక

## కోతులారంలో పంచాయతీ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ



మునుగోడు, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 05:విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మునుగోడు మండలం కోతులారం గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ జాల జంగయ్య, ఉపసర్పంచ్ గుల్లి శంకర్, పంచాయతీ కార్యదర్శి రావుల బాబు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు సిబ్బందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాల జంగయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బందిని దసరా పండుగ సందర్భంగా గౌరవించుకోవడం సంతోషంగా ఉ ందన్నారు. గ్రామ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ప్రజలకు పంచాయతీ సేవలు అందించడంలో సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కందుల లింగస్వామి, జాల అండాలు, కందుల బాలరాజు, నల్లవెల్లి అరుణ, కొండూరి నర్సింహ్మా, భీమనపల్లి ప్రభుదాస్, జాజుల పద్మ పాల్గొన్నారు. మాజీ ఉపసర్పంచ్ కందుల నరసింహ, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఏపూరి యాదయ్య, సీనియర్ నాయకులు గుండు చనకిష్టయ్య, కర్నాటి సీతయ్య, కొండూరు పరమేష్, జాల బచ్చి ప్రసాద్, కర్నాటి వెంకటేష్, పందుల శివశంకర్, బొడ్డు వెంకటయ్యతోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.దసరా పర్వదినం సందర్భంగా పంచాయతీ సిబ్బందిని గౌరవిస్తూ దుస్తులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎండిపోయిన బావి



ఇల్లు చాలా పెద్దది
ఆకాశాన్ని తాకే గోడలతో
అద్దాల కిటికీలతో
బంగారు తలుపులతో నిలిచింది
ఆ ఇంటి మధ్యలో
ఒక పెద్ద బావి ఉంది
ఎప్పుడో నీటితో నిండిన బావి
ఇప్పుడు మాత్రం అడుగున
ఒక చుక్క తడిని వెతుక్కుంటోంది
గదుల్లో ధనం ధాన్యంలా పోగవుతోంది
కానీ ఆ బావిలో
ఒక్క నవ్వు గింజ కూడా పడటం లేదు
దీపాలు రాత్రంతా వెలుగుతున్నాయి
కానీ బావి అడుగున
చీకటి తన నీడను తానే తాగుతోంది
బంగారు పాత్రల్లో విందులు జరుగుతున్నాయి
కానీ ఆ ఇంటి గొంతుల్లో
ఆప్యాయత అనే నీరు ఎండిపోయింది
తలుపులు ఎన్నో ఉన్నాయి
కానీ హృదయానికి తెరుచుకునే
ఒక్క తలుపూ లేదు
కిటికీల గుండా గాలి వస్తోంది
కానీ మనసుల మధ్య
ఒక్క ఊపిరి కూడా ప్రయాణించడం లేదు
అలమారాల్లో సంపద పెరుగుతోంది
బావిలో మాత్రం
దాహం పెరుగుతోంది
ప్రతి గదీ నిండిపోతోంది
ఒక్క మనసు మాత్రం
ఖాళీ అవుతోంది
ఎంత పెద్ద ఇల్లు అయినా
బావి ఎండిపోతే
దాహం తీర్చలేం
ఎంత సంపద ఉన్నా
చిరునవ్వు ఎండిపోతే
జీవితం పండదు
చివరికి ఆ ఇంటికిగోడలు కాదు
నీరు కావాలి
ఆ బావిలోకి
ఒక చుక్క ప్రేమ పడాలి
అప్పుడు మాత్రమే
అంత పెద్ద ఇల్లు
ఒక ఇల్లవుతుంది...
అంత పెద్ద జీవితం
ఒక జీవితమవుతుంది.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# మృత్యువు



మృత్యువు అంటే అంతే తనను చూసినవారిని విడిచిపెట్టదురాతన
రూపాన్ని పూర్ణంగా చూసిన ప్రాణం తిరిగి రాదురా
రాజైనా రంకైనా దాని ముందు తలవంచాలిరా
ధనమైనా బలమైనా దాని చేతిలో మట్టికావాలిరా
నిన్నటి గర్వమంతా నేడు నేలపాలురా
నిన్నటి వైభవమంతా రేపటికి జ్ఞాపకాలురా
ఎంత ఎత్తుకు ఎదిగినా చివరికి నేలేరా
ఎన్ని కోటలు కట్టినా చివరి గమ్యం మట్టేరా
ఊపిరి ఉన్నంతవరకే ఈ లోకం మనదేరా
ఊపిరి ఆగిన క్షణమే ఈ దేహం పరాయిదేరా
కాలం కదులుతూనే ఉంటుంది మనం ఆగిపోతాంరా
జీవితం సాగుతూనే ఉంటుంది మనం మిగిలిపోతాంరా
చెప్పని మాటలన్నీ గుండెల్లోనే మిగిలేరా
చేయని పనులన్నీ జ్ఞాపకాలుగా నిలిచేరా
ప్రేమించని హృదయం చివరికి ఒంటరిగా మిగిలేరా
క్షమించని మనసు తన నీడకే భారమై నిలిచేరా
మృత్యువుకు వయసుతో ఎలాంటి బంధమూ లేదురా
దాని పిలుపుకు కాలమనే గోడ కూడా లేదురా
పుట్టుకతో మొదలైన ప్రయాణానికి అదే చివరి దారిరా
జీవితం అనే కవితకు అదే చివరి పాదమురారా
అందుకే ఉన్నప్పుడే మనిషిని మనిషిగా ప్రేమించాలిరా
దూరమయ్యేలోపే మనసులోని మాట చెప్పాలిరా
రేపు మనదని ఎవరూ హామీ ఇవ్వలేరురా
ఈ క్షణమే మనదని మాత్రం మరిచిపోకూడదురా
మృత్యువు తలుపు తట్టేలోపే జీవితం పండించాలిరా
చివరి శ్వాస మిగిలేలోపే మనసును గెలుచుకోవాలిరా
మృత్యువును తప్పించలేము ఇది జగమెరిగిన నిజమురా
కానీ మృత్యువు రాకముందే జీవించడమే అసలైన గెలుపురా.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ

## సేవా కార్యక్రమంతో జన్మదిన వేడుకలు



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 05:మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య మహిళా కార్మికుల సేవలను గుర్తించి, వారికి ఆత్మీయంగా చీరలను అందజేశారు. సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవడం ఆనందంగా ఉందని సురేష్ యాదవ్ తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటంగా కాకుండా సేవా కార్యక్రమంతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

# హాయత్‌నగర్‌లో చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ నూతన బ్రాంచ్ ప్రారంభం

హయత్ నగర్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 5:హయత్‌నగర్‌లో చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ నూతన బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై నిర్వాహకులతో కలిసి బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్‌లో నూతనంగా చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాణ్యమైన కాఫీ, రుచికరమైన ఆహార పదార్థాలను ప్రజలకు అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం వల్ల ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు లభించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ నూతన బ్రాంచ్ విజయవంతంగా కొనసాగాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, స్థానిక నాయకులు, ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య పరీక్షలు



అక్బర్‌పేట-భూంపల్లి, అక్టోబర్ 5, జ్యోతి ప్రభంజనం (ప్రతినిధి): సీజనల్ మార్పుల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్టాపూర్ ఉపసర్పంచ్ దోర్నాల యాదగిరి సూచించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో డెంగ్యూ నివారణలో భాగంగా ఏఎన్ఎం ఆధ్వర్యంలో గ్రామస్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ దోర్నాల యాదగిరి మాట్లాడుతూ.. ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. జ్వరం, ఒంటినొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఏఎన్ఎంను సంప్రదించి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మంతురి బాబు, ఆశా కార్యకర్తలు ర్యాకం లావణ్య, సిద్దిని, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# అనాజ్‌పూర్‌లో కంఠ మహేశ్వర స్వామి ఆలయ స్లాబ్ పనులు ప్రారంభం



రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 05:అనాజ్‌పూర్ గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కంఠ మహేశ్వర స్వామి (కాటమయ్య గుడి) ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా సోమవారం ఆలయ స్లాబ్ నిర్మాణ పనులను గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనాజ్‌పూర్ గ్రామ పెద్దలు, గౌడ సంఘం కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామ రంగమ్మ మృతి పట్ల ప్రముఖుల సంతాపం



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 5 (ప్రతినిధి): చంపాపేట్ మాజీ సర్పంచ్ దివంగత సామ బాల్‌రెడ్డి సతీమణి, చంపాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి మాతృమూర్తి సామ రంగమ్మ ఆదివారం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.సామ రంగమ్మ పార్థివదేహాన్ని చంపాపేట్‌లోని సామ రమణారెడ్డి నివాసానికి తీసుకురావడంతో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామ రమణారెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రంగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.సామ రంగమ్మ మృతికి మాజీ మంత్రి, శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధు యాష్కీ గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.అలాగే యాదగిరిగుట్ట పాలకమండలి డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, కాంగ్రెస్–టీడీపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి ఎస్.వి.కృష్ణప్రసాద్, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ



కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, సామ స్వప్న సుందర్‌రెడ్డి, జలగం మధుకర్‌రెడ్డి, సుజాత నాయక్, లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, జిన్నారం విట్టల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విట్టల్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, మల్లారపు శాలిని తదితరులు నివాళులర్పించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, వంగ సిద్ధాంతరెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డి, రవి ముదిరాజ్, చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నోముల రవీందర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి తదితరులు కూడా సామ కుటుంబాన్ని పరామర్శించారు. వివిధ రాజకీయ పార్టీల డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రతినిధులు, సామ రంగమ్మ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.కన్నీటి వీడ్కోలుసామ రంగమ్మ అంత్యక్రియలు సోమవారం అక్టోబర్ 5న చంపాపేట్‌లోని రెడ్డి స్మశానవాటికలో కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు, రాజకీయ ప్రముఖులు, స్థానికుల సమక్షంలో నిర్వహించారు. ఆమె మృతి సామ కుటుంబంతో పాటు చంపాపేట్ ప్రాంతంలో విషాదాన్ని నింపింది.





# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్, వామపక్షాల ఐక్యపోరు**

**: దేప భాస్కర్‌రెడ్డి**



రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్, 05:ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ కోసం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర వామపక్షాలు ఐక్యంగా పోరాడాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఇండియా కూటమి పిలుపు మేరకు అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న 'సేవ్ డెమోక్రసీ మార్చ్'కు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలపై ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు.అక్టోబర్ 6న ఉదయం 10 గంటలకు కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం శ్రేణులు, ప్రజలు



పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భాస్కర్‌రెడ్డి కోరారు. అక్టోబర్ 8న రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమిస్తామని అన్నారు.కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామేన భీమ్‌భరత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య, సీపీఎం నాయకుడు సామేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ సిరిగాని సాయి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో పోచబోయిన సురేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



మన్సూరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 05:మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అమ్మ చేయూత ఫౌండేషన్ ? ఓల్డ్ ఏజ్ హోమ్ సెంటర్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించి, వృద్ధులు, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ వృద్ధుల ఆశీస్సులు పొందుతూ, చిన్నారులతో కొంత సమయం గడపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేర సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.



# నాణ్యమైన గృహ నిర్మాణాలే లక్ష్యం

**మహదేవ్‌న్ఫ్రా డెవలపర్స్ బ్రోచర్ ఆవిష్కరణ**



నాగోల్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 05: నాణ్యమైన నిర్మాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినియోగదారుల విశ్వాసానికి ప్రాధాన్యమిస్తూ మహదేవ్‌న్ఫ్రా డెవలపర్స్ ముందుకు సాగుతోందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. రవికుమార్ తెలిపారు. నాగోల్‌లో ఆదివారం మహదేవ్‌న్ఫ్రా డెవలపర్స్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన నోముల దయానంద్ గౌడ్, ప్రముఖ గాయకుడు నల్లగొండ గద్దర్ నరసన్న, సినీ నటుడు నెల్వ రాజు వర్మ హాజరయ్యారు. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బి. రవికుమార్‌తో కలిసి వారు జ్యోతి ప్రజ్వలన చేసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా వినియోగదారులతో దీర్ఘకాలిక సంబంధాలను కొనసాగించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. పారదర్శకత, భద్రత, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన సిబ్బంది, నిపుణులైన కార్మికులతో కలిసి నిర్మాణ పనులను చేపడుతున్నామని చెప్పారు.నాణ్యతే ప్రత్యేకతడిజైన్ రూపకల్పన నుంచి నిర్మాణ పనులు, తుది అప్పగింత వరకు ప్రతి దశలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రవికుమార్ తెలిపారు. అత్యాధునిక నిర్మాణ పద్ధతులు, వనరుల సమర్థ వినియోగం, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులో, నిర్దేశిత బడ్జెట్ పరిధిలో ప్రాజెక్టులను పూర్తి చేయడం తమ విధానమన్నారు. వినియోగదారుల ఆశయాలను వాస్తవరూపంలోకి తీసుకురావడంతో పాటు నమ్మకమైన సేవలు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులుఆధునిక జీవనశైలికి అనుగుణంగా సౌకర్యవంతమైన, సురక్షితమైన గృహ నిర్మాణాలను అందించేందుకు కృషి చేస్తున్నామని రవికుమార్ తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే తమ లక్ష్యమని వివరించారు.కీలక ప్రాంతాలకు చేరువమహదేవ్‌న్ఫ్రా డెవలపర్స్ ప్రాజెక్టు ప్రాంతం పలు కీలక ప్రాంతాలకు చేరువలో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్‌కు నడక దూరంలో, గోల్డెన్ లివ్స్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాలకు సమీపంలో ప్రాజెక్టు ప్రాంతం ఉందన్నారు. నాగోల్ మెట్రో స్టేషన్‌కు సుమారు ఐదు నిమిషాలు, ఉప్పల్ క్రాస్‌రోడ్స్‌కు ఎనిమిది నిమిషాలు, కమినేని ఆసుపత్రి, కోహెడ




ప్రాంతాలకు ఎనిమిది నిమిషాలు, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ ఇంటర్నేషనల్ స్టేడియానికి పది నిమిషాలు, ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 10కు సుమారు 12 నిమిషాల ప్రయాణ దూరంలో ఉన్నట్లు తెలిపారు.వినియోగదారుల విశ్వాసమే పునాదివినియోగదారులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకమైన సేవలు అందిస్తున్నామని రవికుమార్ తెలిపారు. ప్రతి ప్రాజెక్టులో నాణ్యత, భద్రత, సమయపాలనకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మెరుగైన గృహ నిర్మాణ పరిష్కారాలతో పాటు సౌకర్యవంతమైన జీవనశైలిని అందించడమే తమ లక్ష్యమన్నారు.మరిన్ని వివరాలకు: ప్లాట్ నంబర్ 24, రోడ్ నంబర్ 14, శ్రీనివాస కాలనీ, శివాలయం సమీపంలో, ఫత్తులగూడ, హైదరాబాద్?500068.ను సంప్రదించాలని కోరారు.

# మాటల్లో కాదు.. చేతల్లో సంక్షేమం

**ఇబ్రహీంపట్నంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

ఇబ్రహీంపట్నం, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్, 05:అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుత ప్రజా పాలనలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు.పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందేలా స్మార్ట్ విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు.



సింగీతం శ్రీనివాసరావు అకాల మృతి

# చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు

**- అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ప్రముఖ సినీ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు అకాల మృతిభారతదేశ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. చుంచుపల్లిలో గల సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ముందుగా దివంగత సింగీతం శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి తన సంఘ సభ్యులందరితో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల మాట్లాడుతూ పుష్పక విమానం చిత్రంతో మాటలు లేని మూకీ చిత్రంగా నిర్మించి సంచలనం సృష్టించిన వ్యక్తి సంగీతం శ్రీనివాసరావు అని పేర్కొన్నారు. అంతేకాకుండా యూనివర్సల్ ఉత్తమ నటుడు అందగాడు అయిన పద్మశ్రీ కమల్ హాసన్ తో విచిత్ర సహోదరులు లాంటి చిత్రంలో మరుగుజ్జు పాత్రను భామనే సత్యభామనే చిత్రంలో పూర్తి మహిళా పాత్రను అదేవిధంగా ఆదిత్య 369, భైరవద్వీపం, శ్రీకృష్ణార్జున విజయం, మయూరి, మైఖేల్ మదన కామరాజు ఇలాంటి ఎన్నో మధురమైన మరపురాని చిత్రాలను మనకు అందించిన గొప్ప లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుని ప్రతి ఒక్క వర్ధమాన సినీ దర్శకులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆచార్య డాక్టర్ మద్దెల పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సంతాపనివాళి కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లిశంకర్, ప్రముఖసంగీత దర్శకులు అపర ఇళయరాజా మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, జూనియర్ రెహమాన్ సలవాది విజయ్, ప్రముఖ రిథమిస్ట్ దేవ సహాయం, గాయకుడు సబ్బారపు కృష్ణ, కళాకారులు ఎన్ వెంకటేశ్వర్లు, జనగం రాజయ్య, కదలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు భారీ నిరసన

**నేడు రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన**

రంగారెడ్డి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 05:సేవ్ డెమోక్రసీ వీక్' కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంపై శంషాబాద్‌లో అఖిలపక్ష నాయకులు కీలక సన్నాహక సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్‌లోని కశిష్ ప్యాలెస్‌లో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఏఐసీసీ , సిపిఐ సీపీఎం ఇండియా కూటమి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవ్ డెమోక్రసీ వీక్'లో భాగంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమంపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రేపు ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టాలని అఖిలపక్ష నాయకులు నిర్ణయించారు.ఈ కార్యక్రమానికి జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సానెం శ్రీనివాస్‌గౌడ్, సీపీఎం కార్యదర్శి బోడ సామేలు, సీపీఐ నాయకులు పాలమాకుల జంగయ్య, ఎంఏ ఖలీద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కొత్తకూర్మ మంగమ్మ, శివకుమార్, పుస్తకాల నర్సింగ్‌రావు, ఓరుగంటి యాదయ్య, దూడల వెంకటేష్‌గౌడ్, దుబ్బాక రామచందర్, కందుకూరి జగన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏషియన్ సన్ సిటీ సొసైటీ ఎన్నికల్లో

# 9 మంది డైరెక్టర్ల ప్యానెల్ విజయం

**నాలుగేళ్ల పోరాటం అనంతరం ఎన్నికలు.. 94 ఓట్లలో 92 చెల్లుబాటు**



రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి,అక్టోబర్ 5 : శేరిలింగంపల్లి పరిధిలోని కోతగూడలో ఉన్న ఏషియన్ సన్ సిటీ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నికలు సెప్టెంబర్ 27న ప్రశాంతంగా ముగిశాయి. సీనియర్ సిటిజన్ల నాయకత్వంలో నాలుగేళ్లుగా కొనసాగిన పోరాటం అనంతరం ఎన్నికలు నిర్వహించారు.మొత్తం 94 ఓట్లు పోలవగా 92 ఓట్లు చెల్లుబాటయ్యాయి. తొమ్మిది డైరెక్టర్ పదవులకు పది మంది అభ్యర్థులు పోటీ చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఏ. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్యానెల్‌కు 68 ఓట్లతో నిర్ణయాత్మక విజయం లభించిందని తెలిపారు.ఏడుగురు డైరెక్టర్లు ఎన్నికఎన్నికల్లో అనంత పద్మనాభరావు మోచెర్ల (అల్మిరా), ఏ. గోవర్ధన్‌రెడ్డి (బ్యాట్), బి. నరేష్‌కుమార్‌రెడ్డి (బ్యాటరీ టార్చ్), ఏ. ప్రమీలరాణి (బ్రష్), పుంద్రు శ్రీకాంత్ (బకెట్), మనుక సురేష్‌యాదవ్ (కొబ్బరికాయ), పి. రామకుమార్ (మంచం), ఎస్. శాంతిలక్ష్మి (కప్ అండ్ సాసర్), షేక్ షకీర్ (ఫ్రాక్) గుర్తులతో పోటీ చేశారు.తమ ప్యానెల్‌కు చెందిన ఏడుగురు డైరెక్టర్లు ఎన్నికయ్యారని, ఏ. గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షుడిగా, సురేష్‌యాదవ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.సమస్యలు పరిష్కరించాలని డిమాండ్240 ఫ్లాట్లతో 2022లో నివాస ప్రాజెక్టుగా ఏర్పాటైన ఏషియన్ సన్ సిటీని ప్రస్తుతం వాణిజ్య ఆస్తిగా పరిగణించడం దురదృష్టకరమని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కార్పస్ నిధులు అందకపోవడం, కాలుష్య సమస్యలు, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం ప్రాంగణంలోకి ప్రవేశించలేని పరిస్థితి, రాకపోకల్లో ఇబ్బందులు, పెండింగ్ పనులు పూర్తికాకపోవడం వంటి సమస్యలతో



నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.బిల్డర్లు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, నివాసితుల



ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు

# 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు

# ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

**బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు విజ్ఞప్తి**



ఎల్ బీ నగర్,, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి,అక్టోబర్ 5: 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న తరహాలోనే వృద్ధులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ప్రతిపాదనలు వస్తున్నట్లు పేర్కొంటూ, బేషరతుగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే సముచితమని అన్నారు.ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద వృద్ధులు వైద్య అవసరాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు రవాణా ఖర్చులు భారంగా మారుతున్నాయని తెలిపారు. పల్లె వెలుగు నుంచి ఎక్స్‌ప్రెస్ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తే వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ఈ అంశంపై గతంలో అనేక సందర్భాల్లో బీసీ హక్కుల సాధన సమితి తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశామని ధనుంజయ నాయుడు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వృద్ధులకు ఉచిత బస్సు ప్రయాణం అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే పథకానికి అనవసరమైన షరతులు విధించకుండా అందరికీ వర్తించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. వయోవృద్ధుల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేసి, వారికి ప్రభుత్వం అండగా నిలవాలని ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు.

ప్రజా ప్రతినిధులుగా..

# ప్రజలను కలవండి.. సమస్యలు తెలుసుకోండి..

**పరిష్కారానికి కృషి చేయండి**

**ప్రభుత్వ ఖాళీ స్థలాలు గుర్తించు.. బోర్డులను ప్రదర్శించు**

**విద్యుత్ శాఖ పై ఆగ్రహం**

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**



గార్ల ప్రజా ప్రతినిధులుగా గెలిపించిన ప్రజలను కలవాలని, సమస్యలు తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హితవు పలికారు. సోమవారం పట్టణ శివారు రైతు వేదికలో ప్రత్యేక అధికారి దేశి రామ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ గ్రామాభివృద్ధియే దేశాభివృద్ధి అని ప్రజా ప్రతినిధులుగా నిత్యం జనాల సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ పరంగా నిధులు తెచ్చుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ప్రతినిధుల కర్తవ్యం అన్నారు. గెలవడం గొప్ప అని, ప్రజల కోసం పాటుపడి కృషి చేస్తే తిరిగి గెలుపుకు అవకాశం ఉంటుందన్నారు. సర్పంచులు, గ్రామాలలో గడప గడపకు ఇంటింటా ప్రజలతో మమేకమై కలిసికట్టుగా పనిచేసి ప్రగతి పదములో పయనించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారుల వెంటబడి పనులు చేయించుకోవాలన్నారు. ఫారెస్ట్ అధికారులు చుక్కలు చూపించిన సందర్భాన్ని గుర్తు చేశారు. పని అయిపోయిందని అనుకోకుండా గ్రామపంచాయతీల పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి, ప్రభుత్వ స్థలము అని బోర్డులను ప్రదర్శించాలని తాసిల్దార్ శారదకు సూచించారు. అంతకుముందు వివిధ మండల వ్యాప్త పద్దులపై వ్యవసాయ శాఖ కే రామారావు, వైద్యశాఖ డాక్టర్ హనుమంతరావు, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఐకెపి, నీటిపారుదల, హౌసింగ్ బోర్డ్ అధికారులు వివరాలతో వివరించారు. విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ పద్దుల పై ప్రసంగిస్తుండగా సర్పంచులు రామ్ సింగ్ నాయక్, భూక్యరామ్ సింగ్ నాయక్, శంకర్, పార్వతి నాయక్ తదితరులు కల్పించుకొని విద్యుత్ నిరంతరయంగా ప్రజలకు అందించాలని, అప్రకటిత కోతలను నివారించాలని, లూజ్ తీగలను సరిచేయాలని, తీగలకు అడ్డువచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు, ఎమ్మెల్యే కలగజేసుకొని విద్యుత్ శాఖను ప్రశ్నించగా? 15 రోజులలో పూర్తి చేస్తామని విద్యుత్ శాఖ అధికారి జవాబు ఇచ్చారు. మిషన్ భగీరథ తాగునీటిపై సరఫరా సక్రమంగా లేదని ఎక్కువ మొత్తంలో సర్పంచులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండల అధికారులు సమన్వయంగా పని చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు, ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఎంపీడీవో మంగమ్మ తాసిల్దార్ శారద ఎంఈఓ మంకిడి వీరభద్రరావు ఎంపీఓ శ్రీలక్ష్మి, కవిత కార్యాలయ సిబ్బంది 20 జీపీల సర్పంచులు, గార్ల బయ్యారం సీఐ, ఎస్సై బి సాయికుమార్, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

# సింగరేణి కార్మికుల సమస్యలను

# పరిష్కరించాలంటూ కవిత ఆందోళన

సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ రక్షణ సేన ఆందోళనకు దిగింది. ఈరోజు(సోమవారం) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో.. నగరంలోని సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు 35% వాటా చెల్లించాలని, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ ఫిట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. నెలకు 2 సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని, మారుపేర్లు (అలియాస్ నేమ్స్) కార్మికుల సమస్య పరిష్కరించాలని పట్టుబట్టారు.



**మరిన్ని డిమాండ్లు..**

జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేయాలి

విజిలెన్స్ పేరుతో ఆపిన డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రతి కార్మికుడికి సొంత ఇంటి పథకం కోసం 2 గుంటల భూమి ఇవ్వాలి

సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలి

సింగరేణి కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలి

కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ సిఫార్సుల మేరకు జీతాలు ఇవ్వాలి

ప్రభుత్వం సింగరేణికి బాకీ పడిన రూ.62 వేల కోట్లు వెంటనే చెల్లించాలి..

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com